



జెఎన్‌టియులో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్







- తల్లిదండ్రులకు ఫీజుల భయం
- నోట్ల కట్టలతో పాఠశాలలకు..!
- ప్రారంభమైన ఖరీఫ్ సీజన్
- రైతులకు పెట్టుబడుల బెంగ
- ఈ నెలంతా ఏదో రూపంలో ఖర్చులే

# ఖర్చుల మాసం..!

జూన్ మాసం వచ్చిదంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు బెంగ పట్టుకుటుంది. ముఖ్యంగా చదువుకునే విద్యార్థులున్న ఇళ్లలో జూన్ ఫీవర్ మరింత ఎక్కువగానే ఉంటుంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం ఇలా అన్ని ఖర్చులూ ఒకే సారి వస్తాయి. ఇక ఖరీఫ్ సీజన్ కూడా ఈ నెల నుంచే ప్రారంభం అవుతుంది. తొలకరి వర్షాలు పడడంతో రైతులు ఖరీఫ్ సేద్యాన్ని ప్రారంభిస్తారు. పంటల సాగు నిమిత్తం పెట్టుబడుల కోసం రైతుల వెతుకులాట ప్రారంభం అవుతుంది. ఓ వైపు విద్యా సంవత్సరం.. మరో వైపు ఖరీఫ్ సీజన్ ఒకే సారి ప్రాంభం కావడంతో అన్ని కుటుంబాలపై ఏదో ఒక రూపంలో జూన్ భారం పడుతుంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



### ఫీజుల భారం..!

వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చేశాయి. మరో 10 రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ప్రయివేటు పాఠశాలలు తెరిచారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లను చేసేస్తున్నారు. పుస్తకాలు వచ్చాని, వెంటనే తీసుకోవాలంటూ తల్లిదండ్రులకు ఫోన్లమీద ఫోన్లు చేస్తున్నారు. ముందస్తు ఫీజులు, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఇద్దరు విద్యార్థులు ఉన్న కుటుంబంలో ప్రయివేటు పాఠశాల అయితే రూ.30వేలు, కార్పొరేట్ పాఠశాల అయతే రూ.70వేలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. ఫీజుల మోతతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, అమ్మఒడి లాంటి పథకాల అమలు చేస్తున్నా ఇవి పెరిగిన పుస్తకాలు, ఫీజుల ధరలకు ఏ మూలకూ సరిపోవడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1200 ప్రయివేటు పాఠశాలలు, 500 వరకు కార్పొరేట్ పాఠశాలలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పాఠశాలల్లో సుమారు 1.50 లక్షల మందికి పైగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ నోట్ల కట్టలతోనే పాఠశాలలకు వెళ్లాలి. నర్సరీ స్థాయి నుంచే ఫీజుల రూపంలో రూ.25 నుంచి రూ.50వేల వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. విద్యార్థి తరగతి పెరిగే కొద్దీ ఫీజుల భారం కూడా పెరుగుతూ పోతోంది. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూని ఫామ్స్ ఇలా అన్నింటికీ లక్షల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇంట్లో ఇద్దరు పిల్లల ఉంటే ప్రస్తుతం కొంత ఫీజు కట్టి, పుస్తకాలు, యూనిఫాం తీసుకోవాలంటే రూ.70వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇంటర్, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు అయితే వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్, ఫీజులకు రూ.3 లక్షల వరకు ఖర్చు వస్తోంది. టెక్నో, సిబ్యాచ్, నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ తదితర వాటికి మరింత అదనంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. డబ్బున్న వారికి ఇది పెద్ద సమస్య కాకున్నా సామాన్యులు, చిరుద్యోగులకు పెనుభారంగానే ఉంటోంది. ఫీజుల నియంత్రణ అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను క్రమబద్ధీకరించి ఫీజుల వసూళ్లపై నిఘా ఉంచితే సామాన్యులకు విద్య భారం కాకుండా ఉటుంది.

### నోట్ల కట్టలతో విద్యాలయాలకు..!



ఒకప్పుడు విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో విద్యాలయానికి వెళ్లే వారు. కార్పొరేట్ విద్యా వ్యాపారం రాకతో తల్లిదండ్రులు నోట్ల కట్టలతో అక్కడికి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. గడిచిన పదేళ్ల కాలంలో వందలు వేలుగా, వేలు లక్షల్లాగా ఫీజులు పెరిగాయి. కార్పొరేట్ పాఠశాల అంటే చాలు లక్షల్లోనే ఫీజుల మాట విన్పిస్తోంది. అది కూడా ఎల్‌కెజి, యుకేజీ స్థాయికే ఈ స్థాయిలో డబ్బులను తల్లిదండ్రులతో లాగేస్తున్నారు. తమ పిల్లలు తమలా కాకుండా.. మంచిగా జీవితంలో స్థిర పడాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు వారి కష్టాన్ని మొత్తం ఫీజుల రూపంలో ప్రయివేటు, కార్పొరేట్‌కు దారబోస్తున్నారు.



### రైతులకు పెట్టుబడుల భారం

జూన్ నెల రైతులపై కూడా భారాన్ని తెస్తుంది. ఖరీఫ్ సీజన్ ఈ సమయంలోనే ప్రాంభం అయి పొలం పనులు ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభం అయ్యింది. గత పది రోజుల కాలంలో వర్షాలు కూడా రావడంతో రైతులు పొలంలో వేసవి దుక్కుల పనుల్లో నిమగ్నం అయ్యారు. సబ్సిడీ వేరుశన విత్తనకాయల కొనుగోలుకు అన్నదాతలు ఆసక్తి చూపున్నారు. గతేడాది సరిగా పంటలు చేతికందక పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. ఉద్యానవన రైతులు కూడా దిగుబడులు రాక నష్టాలను చవిచూశారు. ఈ నేపథ్యంలో రైతుల చేతిలో చిల్లిగవ్వలేకుండానే వ్యవసాయ పనులను ప్రారంభించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విత్తనాలు, పురుగు మందుల కొనుగోలు, పొలం పనులు, కూలీలు ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడులు ఖర్చు చేయాల్సి ఉంది. ఇటీవల ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే ఇది ఉమ్మడి జిల్లాలో 20 శాతం మంది రైతులకు కూడా అందలేదు. ఖాతాల్లో వేసిన వారికి కూడా అరకొరగానే నగదు జమ అయ్యింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడి రాయితీ కింద ఎకరాకు రూ.20వేలు సాయం అందించి పంట సాగును ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

# ఏ ఫలితం ముందు..?

- ఓట్ల లెక్కింపునకు పూర్తవుతున్న ఏర్పాట్లు
- పార్లమెంటుకు 14, అసెంబ్లీకి 19 టేబుళ్లు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ఉత్కంఠ పెరుగుతోంది. వచ్చే మంగళవారం జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం చేపట్టింది. అనంతపురం పార్లమెంటు పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాలకు ఓట్ల లెక్కింపు అనంతపురం జెఎన్‌టియులో జరగనున్నాయి. దీనికి సంబంధించి అవసరమైన ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు కావడంతో పార్లమెంట్, అసెంబ్లీ రెండింటికీ ఒకేసారి ఎన్నికలు జరిగాయి. దీంతో ఈ రెండు ఓట్ల లెక్కింపు ఒకేసారి జరగనుంది. అనంతపురం పార్లమెంటుకు వచ్చే సరికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఒక రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. మొత్తం పూర్తవ్వాలంటే 21 రౌండ్ల వరకు జరగనున్నాయి. అదే అసెంబ్లీ నియోజకవర్గాల వరకు చూస్తే ఒక రౌండ్‌కు 19 టేబుళ్లు ఉండనున్నాయి. దీని ప్రకారం సగటున 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవనుంది. నాలుగు గంటల వ్యవధిలో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఉదయం 7.30 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేసియున్నారు. అంటే మధ్యాహ్నం ఒంటి గంటలోపు పూర్తయ్యే విధంగా ఏర్పాట్లు చేపట్టియున్నారు.

**అసెంబ్లీ ఫలితాలే ముందు రానున్నాయి..**

అనంతపురం పార్లమెంట్ పరిధిలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిల్లో ఏ నియోజకవర్గ ఫలితం ముందురానుందోనన్నది ఆసక్తికరంగామారింది. పోలింగ్ స్టేషన్ల వారీగా చూస్తే తక్కువ ఉన్నది కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం. ఇక్కడ 261 పోలింగు స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో పోలింగు స్టేషన్‌కు ఒక ఇవిఎం చొప్పున ఒక రౌండ్‌కు ఒక ఇవిఎం రానుంది. 19 టేబుళ్ల ప్రకారం 14 రౌండ్లలోపే ఫలితం రానుంది. ఉరవకొండలో 263 పోలింగు కేంద్రాలున్నాయి. ఇది కూడా 14 రౌండ్లలోపే ఫలితం వస్తుంది. తాడిపత్రి 274 పోలింగు కేంద్రాలు 14 రౌండ్ల కంటే ఎక్కువ ఫలితమొస్తుంది. గుంతకల్లు 276 పోలింగు కేంద్రాలు ఇది కూడా 15 రౌండ్లలో పూర్తవనుంది. రాప్తాడు 281 పోలింగు కేంద్రాలు 15 రౌండ్లు రానున్నాయి. అనంతపురం 292 పోలింగు కేంద్రాలు, శింగనమల 293 పోలింగు కేంద్రాలు, రాయదుర్గం గరిష్టంగా 296 పోలింగు కేంద్రాలు ఉన్నాయి. ఇది 16 రౌండ్ల వరకు లెక్కింపు జరగనుంది. ఇలా చూసినప్పుడు అన్నింటి కంటే ముందు కళ్యాణదుర్గం తక్కువ పోలింగు కేంద్రాలు ఉండటంతో ముందుగా ఇది పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఏది ఏమైనా ఫలితాలపై సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠత నెలకొంది. అధికారులు మాత్రం ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి గందరగోళం లేకుండా సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగు కేంద్రాల వద్దకు అనుమతి ఉన్న వారు తప్ప తక్కిన వారిని రానివ్వడంలేదు. అంతేకాకుండా జిల్లా అంతటా 144 సెక్షన్‌ను ఇప్పటి నుంచే అమలు చేస్తున్నారు.



కౌంటింగ్‌కేంద్రంలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

# ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

## కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
## కలెక్టర్ పి.అరుణ్ బాబు

**ప్రజాశక్తి-హిందూపురం, లేపాక్షి**

ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పి అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం హిందూపురం రూరల్ మండలం గుడ్డంపల్లి వద్ద ఉన్నా బిట్ కళాశాల, లేపాక్షిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను, అక్కడి భద్రతా చర్యలను, ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ పి అరుణ్ బాబు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు అన్నీ ముందస్తుగానే పూర్తిచేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి అధికారులు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు వెళ్లేందుకు బారికేడ్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కోసం చేపట్టవలసిన ఏర్పాట్లన్నీ సంబంధిత రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. బిట్ కళాశాల, లేపాక్షి గురుకుల పాఠశాల ప్రధాన ద్వారం వద్ద బందోబస్తు పటిష్టంగా కొనసాగించాలని ఆదేశించారు. ఇవిఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్వైజర్ ,(గెజెటెడ్), ఒక కౌంటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్ స్టాఫ్ ఒకరు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, అదే విధంగా ప్రతి టేబుల్ వద్ద పోస్టల్ బాలెట్ కోసం ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, ఒక కౌంటింగ్ సూపర్ వైజర్ (గెజెటెడ్), ఇద్దరు కౌంటింగ్ అధికారులు (గెజెటెడ్), ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. ఆ విధంగా కౌంటింగ్ ప్రక్రియ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆర్ఒలకు సూచించారు. అదే విధంగా ఈటిపిబిఎస్ కు సంబంధించి ప్రతి టేబుల్ కు ఒక సూపర్వైజర్, ఒక అసిస్టెంట్, ఒక ఎఆర్ఒ ఉంటారని అన్నారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు కేంద్రానికి, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రాలకు వెళ్ళుటకు సిబ్బందికి, ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇవిఎంల ఓట్ల లెక్కింపు కేంద్రంలో వరుసకు ఏడు చొప్పున మొత్తం 14 టేబుల్ల చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏయే బ్లాక్ లలో ఏయే నియోజకవర్గాల లెక్కింపు జరుగుతుందో అందరికీ అర్థం అయ్యేలా సైన్ బోర్డు లను స్పష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా, కౌంటింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్‌ను అమలులో ఉందన్నారు. కౌంటింగ్ సందర్భంలో బాణసంచా మద్యం విక్రయాలపై, లూజు పెట్రోల్ అమ్మకాలపై పూర్తిగా నిషేధం విధించామన్నారు. ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ ఆర్ఒ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, కదిరి ఆర్ఒ వంశీకృష్ణ, మడకశిర నియోజకవర్గం ఆర్ఒ గౌరీ శంకర్, పుట్టపర్తి ఆర్ఒ భాగ్య రేఖ, ధర్మవరం ఆర్ఒ వెంకట శివ సాయి రెడ్డి ఆయా నియోజకవర్గాల సహాయ ఎన్నికల అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి : వ్యకాసం

**ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్**

ఉపాధి కూలీలకు పనిచేసే ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కొత్త చెరువు మండల పరిధిలోని బైరాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు పని ముట్లు ఇవ్వాలని , చేసిన పనులకు పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కలిసి పోరాడి ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలని కూలీలకు పిలుపునిచ్చారు.

# ఈసెట్ ఫార్మసీ ఫలితాల్లో 'పురం' విద్యార్థినుల విజయకేతనం

**ప్రజాశక్తి-హిందూపురం**

గురువారం విడుదలైన ఏపీ ఈసెట్ ఫార్మసీ విభాగపు ఫలితాలలో స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఫార్మసీ విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ఎన్ హరీష్ బాబు తెలిపారు. కళాశాల ఫార్మసీ విద్యార్థినులు టీ. హర్షిత రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, సభా నౌషిన్ 7వ ర్యాంకు, హాజీరా ఫాతిమా 8వ ర్యాంకు సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అలాగే కళాశాల విద్యార్థినులు సాదియా భాను (16),యం. దివ్య (19), ఎస్ ఆర్ రుమాన (19), అర్షియా భాను (21), ముస్కిరా అంజూమ్ (24), హఫ్సా (33) ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ తెలిపారు. వీరితో పాటు ఇతర విద్యార్థులు సైతం మంచి ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఫార్మసీ విభాగంలో అత్యుత్తమ బోధన, విద్యార్థుల పట్ల అధ్యాపకుల యొక్క ప్రత్యేక శ్రద్ధ ఈ విజయానికి కారణమన్నారు. వరుస సంవత్సరాలలో ఫార్మసీ విభాగంలో కళాశాల తరపున రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ రావడం కళాశాలకు గర్వకారణంగా ఉందని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, కళాశాల అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఫార్మసీ విభాగానికి సంబంధించిన దరఖాస్తులు జూన్ 15వ తేదీ వరకు కళాశాలలో స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

# ధర్మవరంలో ఉలికిపాటు..!

- యువ న్యాయవాది దారుణ హత్య
- మృతుడు ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి
- హత్యకు భూ వివాదమే కారణమా..?

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్, హిందూపురం టౌన్**



మృతదేహాన్ని చూసి విలపిస్తున్న కుటుంబ సభ్యులు

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణం గురువారం నాడు ఉలికిపాటుకు గురైంది. యువ న్యాయవాది, ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ దారుహత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఒక్కసారిగా ధర్మవరాన్ని ఉలికిపాటుకు గురి చేసింది. ఇందుకు సంబంధించి... పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... సంపత్‌రాజ్ ఎన్ఎస్‌యుఐ కేరళ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా ఉన్నాడు. ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికల వ్యవహారాలను చూసుకున్నాడు. అక్కడ పనులు ముగించుకుని నాలుగు రోజుల క్రితం హిందూపురానికి వచ్చాడు. బుధవారం రాత్రి హిందూపురం పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న పాన్ షాప్‌లో రెండు పాన్‌బీడాలు కట్టించుకుని వెళ్లాడు. అనంతరం తన అక్క భాగ్యలక్ష్మికి ఫోన్ చేసి తన స్నేహితులు వచ్చారని, మళ్లీ ఫోన్ చేస్తాను అంటూ ఫోన్ పెట్టేశాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు కారులో సంపత్‌రాజ్‌ను పిలుచుకుని వెళ్లారు. దారి మధ్యలో అతన్ని హత్య చేసి గురువారం తెల్లవారుజామున ధర్మవరం పట్టణంలోని చెరువు రెండో మరువ వద్ద మృతదేహాన్ని పడేసి వెళ్లారు. ఉదయం అటుగా వెళ్లిన ప్రజలు గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతని ప్యాంటు జేబులో ఉన్న పాన్‌బీడా కవర్‌పై ఉన్న అడ్రస్ ఆధారంగా విచారణ చేసి మృతుడు సంపత్‌రాజ్‌గా గుర్తించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలంలో నిశితంగా పరిశీలించారు. విషయం తెలుసుకున్న సంపత్‌రాజ్ తండ్రి రాజశేఖర్, అక్క భాగ్యలక్ష్మిలు ధర్మవరం వచ్చి సంపత్‌రాజ్ మతదేహాన్ని చూసి కన్నీటి పర్యవంతం అయ్యారు. మతుడు సంపత్‌కుమార్ తండ్రి రాజశేఖర్ తన కుమారుడు హత్యకు హిందూపురం సీనియర్ న్యాయవాది కష్టారెడ్డి, అతని కుమారుడు నాగార్జున, మరికొంతమంది కారణం అంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. సంపత్‌రాజ్‌ను ఎక్కడ హత్య చేశారు..? ఎవరు హత్య చేశారు..? ఎందుకు హత్య చేశారు..? హత్యలో ఎవరెవరు ఉన్నారన్న విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు. కాగా సంపత్‌రాజ్‌ను హత్య చేసి మృతదేహాన్ని తీసుకొచ్చిన కారును అనంతపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. సంపత్‌రాజ్ హత్య విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్, అనంతపురం డీసీసీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ధర్మవరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అశ్వర్థనారాయణ, ఎన్ఎస్‌యుఐ నాయకులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య చేసిన నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.



మృతుడు సంపత్‌రాజ్ (ఫైల్‌ఫొటో)

**భూ వివాదమే కారణమా..?**

మృతుని తండ్రి, కుటుంబ సభ్యులు చెబుతున్న మేరకు భూ వివాదమే హత్యకు కారణం అయ్యి ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురంలోని మరో సీనియర్ న్యాయవాదితో ఓ స్థలం వివాదంలో ఇద్దరికి గొడవలు ఉన్నట్లు తెలుస్తోంది. సంపత్‌కుమార్ స్నేహితుడు శ్రీకాంత్‌రెడ్డి చెందిన స్థలం విషయంలో మిత్రుని పక్షనా పోరాటం చేస్తున్నారు. ఈ విషయంలో సంపత్‌రాజ్, మరో న్యాయవాది మధ్య పలుమార్లు ఘర్షణలు జరిగాయి. పోలీసు కేసులు కూడా నడిచాయి. తనకు ప్రాణహాని ఉందని మతుడు సంపత్‌రాజ్ పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కోణంలోనే అతని హత్య జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

**విద్యార్థి, దళిత సంఘాలు, న్యాయవాదుల ఖండన**

ఎన్ఎస్‌యుఐ నాయకుడు, యువ న్యాయవాది సంపత్‌రాజ్ హత్యను పలు విద్యార్థి, దళిత సంఘాలు, న్యాయవాదులు ఖండించారు. సంపత్‌రాజ్ హత్య నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూపురంలో విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు బాబావలి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఎపిఎస్ఎఫ్ నాగభూషణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంపత్ రాజ్ హత్యను ఖండిస్తూ దళిత, ప్రజా సంఘాల నాయకులు గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, బిఎస్‌పి శ్రీరాములు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి కుమార్, మాదిగ దండోర జిల్లా నాయకులు మద్దిలేటి, దళిత సమాఖ్యా జిల్లా అధ్యక్షులు సుబ్బరాయప్పలు మాట్లాడారు. దళిత కుటుంబంలో పుట్టి అత్యున్నత స్థాయికి ఎదిగిన సంపత్‌రాజ్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే దుండగులు హత్య చేశారన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# కార్మిక, కర్షకులకు అండగా సిఐటియు




కదిరి, పరిగిలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

## జిల్లా వ్యాప్తంగా ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

కార్మిక కర్షక వర్గాలకు అండగా హక్కుల కోసం ఆవిర్భవించిన సంఘం సిఐటియు అని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్ నరసింహులు, పట్టణ కార్యదర్శి జగన్మోహన్ అన్నారు. గురువారం సిఐటియు ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా సివిల్ సప్లై గోడౌన్ వద్ద కార్మికులతో కలిసి జెండా ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గానికి అండగా పోరాటాలు చేసేందుకు సిపిఎం అనుబంధ సంఘం సిఐటియు ఏర్పడిందన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణతో పాటు కార్మిక వర్గాన్ని రాజకీయంగా చైతన్య పరుస్తూ సమాజ మార్పుకు సిఐటియు కృషి చేస్తుందని తెలిపారు. నేడు దేశంలో పాలకవర్గాలు అనుసరిస్తున్న కార్పోరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ మతోన్మాద చర్యలను ఎండగడుతూ రైతు, ప్రజా పోరాటాలకు సిఐటియు అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ముస్తాక్, రామ్మోహన్, నారాయణ ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్, సివిల్ సప్లై యూనియన్ నాయకులు శివప్రసాద్, ఫక్రుద్దీన్, రాము, మా భాష, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపాలు, బాలకృష్ణ, జనార్ధన తదితరులు పాల్గొన్నారు.

**పరిగి :** మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన సిఐటియు ఆవిర్భావ దినోత్సవంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ వర్గ పోరాట సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సిఐటియు నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రైతులకు సంబంధించిన మూడు నల్ల చట్టాలకు, ఉద్యోగ కార్మికులకు సంబంధించిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మిక రైతు ఐక్య ఉద్యమాలను నిరంతరం సాగిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సజ్జప్ప, పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి అర్బన్ :** కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం వారి పక్షాన నిలిచి సిఐటియు అనేక పోరాటాలు చేసి విజయం సాధిస్తూనే ఉంటుందని సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ పేర్కొన్నారు. గురువారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం సమీపంలో సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు కార్మికుల పక్షపాతిగా రాజీలేని పోరాటాలు చేసి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. అలాగే సిఐటియు కార్యాలయం ఎనుములపల్లి వద్ద కూడా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు నరసింహులు, రామయ్య, పెద్దన్న, గోవిందు, శ్రీనివాస్, బాబయ్య, సాయి, ఓబులేసు, నాగార్జున, వెంకటేశు, సరోజమ్మ, వెంకటలక్ష్మమ్మ, మారెక్క తదితరులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** మండలంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండల వెంకటేష్, బాబు, పోతులయ్య, మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.

**ఓబుళదేవరచెరువు :** సిఐటియు 54 వా ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా ఒడిసి మండల కేంద్రంలో ఆటో స్టాండ్ వద్ద సిఐటియు నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వివి రమణ, లక్ష్మీనారాయణ. పెదబల్లి బాబావలి, శ్రీరాములు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి రూరల్:** సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పుట్టపర్తి ప్రశాంతి గ్రామ్ వద్ద నున్న సిపిఎం కార్యాలయం లో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంగాధర్, ఆఫీస్ కార్యదర్శి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలతో విజ్ఞానం




పుట్టపర్తి, ధర్మవరం గ్రంథాలయాల్లోని వేసవి శిక్షణ శిబిరాలను పరిశీలిస్తున్న గ్రంథాలయ అధికారిణి రమ

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాల ఉమ్మడి జిల్లాల కార్యదర్శి రమ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె గురువారం పట్టణంలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులచే పుస్తకాలు చదివించారు. అర్థం కాని విషయాలను ఆమె బోధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య మరింత పెంచాలని అలాగే గ్రంథాలయ సభ్యుల సంఖ్య పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి ఆంజనేయులుకు సూచించారు. పుస్తకాలు కొరత ఉంటే తమ దృష్టికి తెస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి సెలవులలో వధాగా కాలం గడపకుండా విద్యార్థులు పుస్తక పఠనం చేస్తే వారికి విజ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం గ్రంథాలయానికి మున్సిపల్ కార్యాలయం నుంచి రావలసిన బాకీ సెస్ గురించి మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో చర్చించారు. త్వరలోనే సెస్ రూపే వచ్చే డబ్బులు గ్రంథాలయానికి విడుదల చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

**కొత్తచెరువు :** గ్రంథాలయాలను విద్యార్థులు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం కొత్తచెరువులోని శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ నిర్వహించారు గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయరాం, సాలెంరాజు, మునీరు తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం టౌన్ :** ధర్మవరంశాఖ గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య పెరిగేలా చూడాలని గ్రంథాయాధికారిణి అంజలి, సౌబాగ్యవతికి గ్రంథాలయ జిల్లాకార్యదర్శి రమ సూచించారు. ఈమేరకు ఆమె గురువారం శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవిశిక్షణ కార్యక్రమంలో భాగంగా కథలు చెప్పడంం, గ్రామర్, క్విజ్, చిత్రలేఖనం, పుస్తకాలను చదివించడం తదితర వాటిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సబ్సిడీ వేరుశనగ పంపిణీలో అధికారులు, రైతులు

## రైతులందరికీ విత్తన వేరుశనగ

**ప్రజాశక్తి -పెనుకొండ**

రైతు భరోసా కేంద్రాలలో విత్తన వేరుశెనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు బుధవారం నుండి విత్తన వేరుశెనగ పంపిణీ చేస్తున్నట్లు ఎఒ కెసి. చందన తెలిపారు.ఈ సందర్భంగా గురువారం పెనుకొండ పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు పెనుకొండ మండల వ్యాప్తంగా ఉన్న 13 ఆర్‌బికెలకు 603.03క్వింటాళ్ల వేరుశనగ వచ్చిందన్నారు. 886 మంది రైతులు 773.03 క్వింటాళ్ల వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేశారన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది అశోక్ కుమార్, అనిత, రైతులు పాల్గొన్నారు.

## ఆర్డీటీ ఉచితవిద్యకు ఎంజెబి విద్యార్థులు

**ప్రజాశక్తి - రొద్దం**

2024 సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం లాగానే ఆర్డీటీ నిర్వహించిన పరీక్షల్లో రొద్దం ఎంజెబికు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గోపాల్ తెలిపారు. పాఠశాలలో 104 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 101 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో 17 మంది విద్యార్థులు 500 పైచిలుకలు మార్కులు సాధించారన్నారు. ఆర్డీటీ టెట్‌లో మండలంలోని సానిపల్లికి చెందిన కేజీ రామాంజనేయులు, కొత్తచెరువు మండలం నారేపల్లి గ్రామానికి చెందిన శశాంక్ ఆర్డీటీ ఉచిత విద్యకు ఎంపికైనట్లు తెలిపారు.

## పకడ్బందీగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్**

శ్రీ సత్యసాయి జిల్లాలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో మీనాక్షి పేర్కొన్నారు. గురువారం జిల్లాలో బయోలాజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించారని ఈ పరీక్ష కు 5592 మంది పరీక్ష రాయాల్సి ఉండగా వారిలో 3643 మంది హాజరయ్యారన్నారు. జిల్లా పరిధిలో 29 కేంద్రాలలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం

**బుక్కపట్నం :** మండల కేంద్రంలోని పేట వీధిలో గల శ్రీరామ ఆలయ అభివృద్ధి పనులకు బెంగళూరుకు చెందిన వారు విరాళం అందజేశారు. బెంగుళూరుకు చెందిన సాయి మురారి హోమ్స్ వారు లక్ష రూపాయల చెక్కును శ్రీరామ సేవా సమితి ట్రస్టు ప్రెసిడెంట్ రాజశేఖర్ గౌడ్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో ఆలయం పూర్తిగా కోల్పోవడంతో ట్రస్టు ద్వారా దాతల సహకారంతో నూతన ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. లక్ష రూపాయలు నగదును విరాళంగా అందజేసిన బెంగళూరు చెందిన సాయి మురారి హెూమ్స్ సభ్యులైన మురళీకష్ణ, కెంపరాజు రాజశేఖర్ గౌడ్, శివరాజ్, గోపాల్ రెడ్డికి కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాజీఎంపీపీ బాలు, గొర్లకృష్ణ, అక్కులప్ప, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**రొద్దం :** ప్రతి పాఠశాలలో భోజన ఏజెన్సీలు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఇఒ జయభాస్కర్ సూచించారు. గురువారం స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలలో మండలంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భోజన ఏజెన్సీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి కావలసిన సూచనలు, సలహాలు, ఇచ్చారు. ఈ సమావేశానికి మండల వ్యాప్తంగా దాదాపు 30 పాఠశాలల ఏజెన్సీలు హాజరయ్యారు.

# ఆలిండియా పోటీలకు కెహెచ్ డిగ్రీకళాశాల విద్యార్థి



ప్రతిభా విద్యార్థితో కెహెచ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

ఆలిండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ధర్మవరంపట్టణంలోని కెహెచ్ డిగ్రీకళాశాల విద్యార్థి లోకేశ్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తమ కళాశాలలో ప్రథమసంవత్సరం బికాం చదువుతున్న లోకేశ్ గత ఏడాది ఆగస్టు 18వతేదీలలో ఎస్కే యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో లోకేశ్ ప్రతిభ కనబరచి ఎస్‌కె యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థి తమిళనాడు జెప్పియర్ యూనివర్సిటీలో ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఆలిండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్కేయూ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ నేపథ్యంలో కళాశాలలో లోకేష్‌ను ప్రిన్సిపల్ తోపాటు పీడీ ఆనంద్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది గురువారం అభినందించారు.

# రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

ఓట్లు లెక్కింపు నేపథ్యంలో గెలుపు ఓటములు సహజమని, అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని పట్టణ సిఐ కొండారెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక సాయి ఆరామం అతిథిగృహంలో ఉదయం, సాయంత్రం వైసిపి, టిడిపి నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ఎక్కడ విజయోత్సవ సంబరాలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడం నిషేధమని అన్నారు. పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎవరు గుంపులు గుంపులుగా ఉండి ఎలాంటి ఘర్షణలకు గొడవలకు తావు ఇవ్వరాదన్నారు. అలాగే జూన్ 4న పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుందని సమావేశాలు ర్యాలీలకు అనుమతి లేదని అన్నారు. కౌంటింగ్ సందర్భంగా గొడవలు పడితే వారిపై రౌడీషీట్ బనాయిస్తామని వారు జిల్లా బహిష్కరణకు గురవుతారని అన్నారు. అలాగే మండలంలో కేంద్ర సాయుధ బలగాలు మొహరింపబడతాయన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 2 కిలోమీటర్లు లో ఎవరికి అనుమతి ఉండదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి, టిడిపి ముఖ్య నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

# నేరాలు ఘోరాలు

## వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి - రొద్దం**

తన తల్లిదండ్రులు మందలించారన్న కారణంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రొద్దం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. అందుకు సంబందించిన వివరాలు.. రొద్దం పాత ఎస్సీ కాలనీకి చెందిన చంద్రమోహన్(32) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో అతను తాగుడుకు బానిసయ్యాడు. పెళ్లి చేస్తే మారుతాడని భావించిన అతని తల్లిదండ్రులు కర్నాటక రాష్ట్రం పావగడ తాలూకా పొన్నసముద్రం గ్రామానికి చెందిన నరసప్ప కుమార్తె గంగ రత్నమ్మతో వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు ధ్రువ, యశ్వంత్ కలిగారు. అయితే చంద్రమోహన్ జీవనశైలిలో మార్పురాలేదు. భార్య పిల్లల గురించి గానీ పట్టించుకోవటం మానేశాడు. దీంతో ఎలా బతుకుతారని చంద్రమోహన్‌ను అతని తల్లిదండ్రులు మందలించారు. ఈనేపథ్యంలో గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకు బహిర్భూమికోసం ఇంటిలో నుంచి బయటకు వెళ్లాడు. వెళ్లిన వ్యక్తి ఎంతసేపటికి తిరిగి రాకపోవటంతో తల్లి దుర్గమ్మ అతని కోసం వెతకడానికి బయటకు వెళ్లింది. గ్రామ సమీపంలో చింత చెట్టుకు చీరతో ఉరి వేసుకుని కన్పించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కంటైనర్

**ప్రజాశక్తి - ముదిగుబ్బ**

మండల పరిధిలోని సంకేపల్లి క్రాస్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలయినట్లు సిఐ యతీంద్ర తెలిపారు. మండల పరిధిలోని వలిమిచెర్లోపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బకు వచ్చి కూరగాయలు తీసుకొని, తిరిగి స్వగ్రామానికి వెళుతున్న తరుణంలో సంకేపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని తమిళనాడు నుండి అహ్మదాబాద్‌కు వెళుతున్న కంటైనర్ వెనుక వైపు నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బిసిజి వ్యాక్సిన్‌తో ఉపయోగం

**ప్రజాశక్తి-హిందూపురం**

జిల్లా వ్యాప్తంగా పైలట్ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్న వయోజన బీసీజీ టీకా కార్యక్రమాన్ని వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి బాబా ఫక్రుద్దీన్, డీపీహెచ్ఎన్ ఈరమ్మ పిలుపు నిచ్చారు. గురువారం పట్టణంలోని ఆజాద్ నగర్, లక్ష్మీపురం తదితర సచివాలయాలలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వారు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి గురువారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, 65 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, ఇంతకు మునుపు టీబీ సోకిన వారు, వారి బంధువులు, మధుమేహం వ్యాధిగ్రస్తులకు తదితరులకు ఈ టీకా తీసుకోవాలన్నారు. ప్రజల్లో అపోహలను తొలగించి అందరూ ఈ టీకాను సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ మంజుశ్రీ. పట్టణ సిఒలు ముస్తఫా, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోలకు ఆర్థికసాయం

**ప్రజాశక్తి - కదిరి అర్బన్**

ఎపిఎస్ ఆర్టీస్థిలో పనిచేసి, క్రెడిట్ కోపరేటివ్ సోసైటి లో సభ్యత్వం కలిగివుండి 30-6- 2023 కి ముందుగా ఆర్టీసీలో ఉద్యోగ విరమణ పొందిన మాజీ ఉద్యోగులు ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని కదిరి డిపో ఎన్ఎంయుఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిమోహన్ తెలిపారు. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన నోటిఫికేషన్ విడుదల అయిందన్నారు. ఆర్థిక సహాయం కోసం సిసిఎస్‌లో సభ్యుడై ఉండాలన్నారు. సిసిఎస్‌లో నిర్వహించబడే అధికవడ్డీ స్కీం లో వున్నవారు అనర్హులన్నారు. దరఖాస్తులను సమీప డిపోమేనేజరు కార్యాలయం లోను, మరియుసిసిఎస్ డేలిగేట్స్ వద్ద లభిస్తాయని చెప్పారు. మరిన్ని వివరాలను సిసిఎస్ వెబ్ సైట్ నుండి పొందవచ్చునని హరిమోహన్ తెలిపారు.

## అల్లర్లకు దూరంగా ఉండండి

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

జిల్లాలో కౌంటింగ్ అనంతరం గ్రామాలలో ప్రజలు ఎలాంటి అల్లర్లు,గొడవలకు వెళ్లకుండా ఉండాలనిజిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి సూచించారు. జిల్లావ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ తనిఖీలు గురువారం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా సిఐలు, ఎస్ఐలు, సిబ్బందితో కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సమసాత్మకమైన ప్రాంతాలలో పోలీసులు విస్తతంగా తనిఖీలు నిర్వహించారు.

## ముగిసిన కరాటే వేసవి శిక్షణ

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

కదిరి యునైటెడ్ షోటోఖాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కరాటే సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు ఈ కార్యక్రమం లో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. మాస్టర్ షాకిర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 నుండి మే 29 వ తేదీ వరకు బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈశిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా గురువారం నిర్వహించిన ముగింపుకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్ట్ టెస్ట్ ఎగ్జామినర్ కరాటే కోచ్ మురళీకృష్ణారెడ్డి, ఎంఇఒ చెన్నకృష్ణ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట చలం, రిటైర్డ్ అధ్యాపకులు మహబూబ్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే శిక్షణ విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెంపొందిస్తుందన్నారు. ఈ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బెల్ట్ టెస్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. వేసవికాల శిక్షణ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 30 విద్యార్థులు ఉత్తేర్ణులై బెల్ట్స్ సాధించారు. ఈ కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్లు చాందిని, అలైహి వసల్లం, మహమ్మద్ కైఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం

# ప్రజల జీవితాల్లో పొగాకు చిచ్చు..!

## పొగాకు వాడకంతో క్యాన్సర్ ప్రమాదం
## నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

**ప్రజాశక్తి అనంతపురం**

పొగాకు ప్రజల జీవితాల్లో చిచ్చు రేపుతోందని పొగాకు వాడకం వల్ల ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారని అనంతపురంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ ఛాతివైద్యులు డాక్టర్ రంగు సుధీంద్ర అన్నారు. మే 31న నిర్వహించే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించారు.

**పొగాకు వల్ల నష్టాలు :** పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు క్యాన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే.

పొగాకు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయడంకోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.ఈ అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారతదేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గింది. ప్రపంచ ఆరోగ్య అవసరాల దృష్ట్యా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటుచేసిన ఎనిమిది అవగాహన కార్యక్రమాల్లో ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం ఒకటి.



**ప్రాణాలు పోతున్నా :** పొగాకు కారణంగా ప్రాణాలు పోతున్నా పొగరాయుళ్లు పెడచెవిన పెడుతున్నారు. పొగ తాగే వ్యక్తికే కాదు.. పీల్చే వారికి కూడా ప్రమాదకరమే. నిర్లక్ష్యం కారణంగా నిండు జీవితాలు పొగాకు బలి అవుతున్నాయి. పొగాకు ప్రాణాంతకం..! ఇది తెలిసీ చాలామంది ధూమపానానికి బానిసలవుతున్నారు. మానేద్దాం.. మానేద్దాం.. అనుకుంటూనే.. దానిని కొనసాగిస్తున్నవారెందరో వ్యాధుల బారిన పడుతున్నారు. పొగాకు తాగేవారితోపాటు.. వారి కుటుంబసభ్యులు, వారిచుట్టూ ఉన్నవారు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. పొగతాగే అలవాటుకు సాధ్యమైనంత తొందరగా పొగబెట్టకపోతే.. అది చివరకు మన ప్రాణాలకే ముప్పుగా మారుతుంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏనాడో చేసిన హెచ్చరిక. అభిమాన హీరోను చూసో, స్నేహితుల ప్రోద్భలంతోనో, స్టయిల్‌గా ఉంటుందనో.. రెండు వేళ్ల నడుమ సిగరెట్ పెట్టుకొని దమ్ములాగుతున్నారు పొగరాయుళ్లు. మొదట్లో సరదాగానే మొదలుపెట్టి, రోజులు గడుస్తున్నకొద్దీ పొగ దుష్పరిణామాలు ఎదుర్కొంటున్నారు. దగ్గు, దమ్ము, పంటి నొప్పి, గొంతునొప్పి, తలనొప్పి, జలుబు, సైనసైటిస్‌లాంటి చిన్నచిన్న సమస్యలతో మొదలై క్యాన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధులతో నిండు జీవితాన్ని బలిచేసుకుంటున్నారు.

**యువతకు ఫ్యాషన్‌గా మారిన ధూమపానం:**

పొగాకు వాడకం వివిధ రూపాల్లో జరుగుతోంది. ప్రధానంగా పొగ రూపంలో పీల్చి, వదలడం నేటి యువతకు ఫ్యాషన్‌గా మారింది. సిగరెట్, బీడీ, చుట్ట, హుక్కా పీల్చడం. ఇలా ఇది ఏ రూపంలో ఉన్నా అంతిమంగా ప్రాణాంతకంగానే మారుతుంది. చాలామంది తమ కాలేజీ రోజుల్లోనే ధూమపానానికి అలవాటు పడుతున్నట్లు పలు నివేదికలు తేల్చాయి. అందులోనూ ఫ్రెండ్స్ ప్రోద్భలంతోనే సిగరెట్ చేతపడుతున్న యువకుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. సమాజంలో భవిష్యత్తు తరమైన యువత చెడుమార్గాల వైపు వెళుతున్నా తల్లిదండ్రులు, పోలీసులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



డాక్టర్ రంగు సుధీంద్ర

పొగతాగడం వల్ల టీబీ, ఊపిరితిత్తుల వ్యాధులు ఎక్కువగా వస్తుండటంతో.. దీనిపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని విశ్లేషకులు అంటున్నారు. గతంలో అనంతపురంలో జనవాసాల మధ్య ఇలా దమ్ముకొడితే దుమ్ము దులిపేందుకు పోలీసు ఉన్నతాధికారులు బహిరంగ ధూమపానం నిషేధం అమలు చేశారు. అప్పట్లో ఈ విధానం వల్ల పోలీస్ శాఖ ఔన్నత్యం వల్ల సమాజానికి కొంత మేలు జరిగింది. అయితే పోలీస్ శాఖ రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు కొన్ని రోజులు చర్యలు బాగానే చేపట్టినా మళ్లీ యథాస్థితికి వచ్చింది.